ఆదివారం ఆస్పత్రికి సెలవట!

- గోనెగండ్ల వైద్యశాలలో వైద్యులు లేకపోవడంతో వెనుదిరుగుతున్న రోగులు
- ఆదివారం కాల్ డ్యూటీ అంటున్న డాక్టర్లు
- వైద్యుల తీరుపై మండిపడుతున్న ప్రజలు
- ప్రైవేటు ఆసుపత్రులు, ఆర్ఎంపీలను ఆశ్రయించాల్సిన దుస్థితి



గోనెగండ్ల ఆసుపత్రిలో సిబ్బంది లేకపోవడంతో ఖాళీగా ఉన్న ఓపీ కేంద్రం



తలుపులు వేసిన మెడికల్ ఆఫీసర్ గదులు

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్ల ప్రభుత్వ ఆస్పత్రికి ఆదివారం వస్తే సెలవు అన్న రీతిలో వైద్యులు మారిపోయారు. మామూలుగా ప్రభుత్వ శాఖలకు సంబంధించి ఉద్యోగులు సోమవారం నుంచి శనివారం వరకు విధులు నిర్వహిస్తుంటారు. ఆస్పత్రులు మాత్రం ఏడు రోజులు 24 గంటలు పనిచేస్తాయి. ఆదివారం రోజు కూడా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఒక డాక్టరైనా ఉంటారు. అదేమిటో గోనెగండ్ల ఆస్పత్రిలో పని చేసే వైద్యులు మాత్రం ఆదివారం కాల్ డ్యూటీ చేస్తారట. దీంతో ఆదివారం రోగులు ఎవరు ఆస్పత్రికి రాకూడదంటా అనే రీతిలో ఉద్యోగులు చెబుతున్నారని మండల ప్రజలు చెబుతున్నారు. ఆదివారం వైద్యులు లేకపోవడంతో ఆస్పత్రికి వచ్చిన వివిధ రకాల రోగులు వెనుతిరిగి వెళ్లిపోయారు.

ఒక్క స్టాఫ్‌నర్స్ మాత్రమే డ్యూటీలో..

గోనెగండ్ల ప్రభుత్వ ఆస్పత్రికి రోజు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు వచ్చి వైద్యం చేసుకుని వెళ్తుంటారు. ఆస్పత్రికి ప్రతి రోజు 150 నుంచి 200 మంది దాకా ఓపీ ఉంటుంది. అయితే ఆదివారం వైద్యులు లేకపోవడంతో ఆస్పత్రికి వచ్చిన రోగులు వెనుతిరిగి వెళ్లిపోతున్నారు. ఈ ఆదివారం ఒక స్టాఫ్ నర్సు మాత్రమే ఆస్పత్రిలో ఉంది. ఎవరూ లేరని ఆస్పత్రికి వచ్చిన రోగులకు ఆమెనే వైద్యం చేస్తున్నారని రోగులు చెబుతున్నారు. ఆస్పత్రిలో ఇద్దరు రెగ్యూలర్ డాక్టర్లు, ఒక పంటి డాక్టర్, ఒక ఫార్మసిస్టు, ఆప్తాల్మిక్ అసిస్టెంట్, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఒక హెడ్ నర్సుతో పాటు మిగతా స్టాఫ్ కూడా ఉంటారు. ఆదివారం మాత్రం డాక్టర్లు కాల్ డ్యూటీ అంటూ రాకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతూ ప్రైవేట్ ఆస్పత్రులు, ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు.

28 గ్రామాలకు ఈ ఆసుపత్రే దిక్కు..

మండలంలో 28 గ్రామాలకు గాను దాదాపు 70వేల మంది జనాభా ఉంది. వీరంతా గోనెగండ్ల ఆస్పత్రికే వస్తారు. ఆస్పత్రికి వచ్చిన రోగులకు సరైన సమయంలో సరైన వైద్యం అందడం లేదని, ఏదో వైద్యం చేస్తున్నారంటే చేస్తున్నామనే రీతిలో వైద్యులు ఉన్నరాని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో కేవలం సాధారణ కాన్పులు మాత్రమే చేస్తున్నారు. మిగతా అత్యావసర కేసులు వస్తే ఇతర ప్రాంతాలకు రెఫర్ చేస్తున్నారు. ఆదివారం రోజు అత్యవసర సమయంలో ఎవరైనా ఆస్పత్రికి వస్తే వారి ప్రాణాలు గాల్లోకి పోవాల్సిందేనని ప్రజలు వైద్య సిబ్బందిపై మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆదివారం రోజు కూడా ఆస్పత్రిలో వైద్యం అదేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



వైద్యుల కోసం ఎదురుచూస్తున్న యువకులు

ఆస్పత్రిలో ఎవరూ లేరు

మాది గోనెగండ్ల, నాకు తీవ్రమైన జ్వరం వచ్చి నోరు పొంగింది. దీంతో వైద్యం చేయించుకుందామని ఆస్పత్రికి వచ్చాను. అయితే ఆస్పత్రిలో ఎవరు లేరు. దీంతో నాతో పాటు ఆస్పత్రికి వచ్చిన వారందరూ వెనుతిరిగి వెళ్తున్నారు. ఆదివారం రోజు ఆస్పత్రిలో ఎవరు ఉండరంటా. ప్రభుత్వ ఆస్పత్రిలో ఎవరు లేకపోతే నిరుపేదలు ఎక్కడ చూపించుకోవాలి. అధికారులు స్పందించి ఆదివారం రోజు కూడా ఆస్పత్రిలో వైద్య సేవలు అందిలా చూడాలి. – విక్రమ్, గోనెగండ్ల

ఆదివారం కాల్ డ్యూటీ చేస్తున్నాం

వారంలో ఆరు రోజులు విధులు నిర్వహిస్తాం. ఆదివారం మాకు కూడా సెలవు ఉంది. కాల్ డ్యూటీ చేస్తాం. ఆస్పత్రికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్నాం. అత్యావసరం కేసు ఉంటే మా సిబ్బంది ఫోన్ చేస్తే వచ్చి వైద్య సేవలు అందిస్తాం. రోగులు అసౌకర్యాలకు గురి కాకుండా చూసుకుంటున్నాం.
– రంగరవళి, ప్రభుత్వ వైద్యురాలు, గోనెగండ్ల

క్లుప్తంగా

రంజాన్ తోఫా పంపిణీ



మాట్లాడుతున్న డీఎస్పీ హేమలత

ఆదోని అర్బన్: పట్టణంలోని సోషల్ వర్కర్ నూర్ అహ్మద్ ఆధ్వర్యంలో ఆదివారం బిస్మిల్లా ఫంక్షన్ హాల్‌లో 200 పేద ముస్లిం మైనార్టీ మహిళలకు రంజాన్‌తోఫా పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీఎస్పీ హేమలత పాల్గొన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ నేటి సమాజంలో యువకులు ప్రజాసేవలో సేవా కార్యక్రమాలు చేపట్టడం స్ఫూర్తిదాయకమన్నారు. మనతో పాటు ప్రతిఒక్కరూ సంతోషంగా పండగను జరుపుకోవాలన్న సదుద్దేశంతో సేవ చేయడంపై అభినందించారు. ముస్లిం మైనార్టీ మహిళలు తమ పిల్లలను ఉన్నత విద్యను అభ్యసించేలా చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, హుసేన్‌బాషా, మతపెద్దలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ దగ్గర ఆదివారం సాయంత్రం లారీ–బైక్ ఢీ కొనడంతో ఒకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోకి వెళ్తున్న లారీ లోపలి గేట్ వద్ద మలుపు తిరుగుతుండగా వెనుక భాగం ముగతికి వెళ్తున్న రహిమాన్ అనే వ్యక్తి బైక్‌కు తగిలింది. దీంతో రహిమాన్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడ్డ వ్యక్తిని చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. కేసు నమోదు చేసుకున్నట్లు ట్రాఫిక్ హెడ్‌కానిస్టేబుల్ బోయ రామకృష్ణ తెలిపారు.

బెట్టింగ్‌లతో జీవితాలు నాశనం చేసుకోవద్దు

ఆదోని అర్బన్: 2025 ఐపీఎల్‌లో యువత బెట్టింగ్ పేరుతో జీవితాలను నాశనం చేసుకోవద్దని డీవైఎఫ్ఐ పట్టణ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ సూచించారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఐపీఎల్ మ్యాచ్ కేవలం వినోదాత్మక ఉద్దేశంతోనే చూడాలన్నారు. నిరుద్యోగ యువత ఈజీగా డబ్బు సంపాదించాలని జీవితాలను పణంగా పెట్టి బెట్టింగ్ పేరుతో మోస పోతున్నారన్నారు. ఎవరో ఒకరు బెట్టింగ్‌లో డబ్బులు గెలుచుకున్నారనే ఉద్దేశంతో ఆ వలలో చిక్కుకోవద్దని సూచించారు. ప్రభుత్వాలు స్పందించి నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.

26న మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా

ఆదోని రూరల్: 26న మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపడుతున్నట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు గోపాల్, ముక్కన తిప్పన్న, పట్టణ కమిటీ సభ్యులు వీరేష్, నాగరాజు తదితరులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం కల్లుబావి జ్యోతిబసు భవన్‌లో ధర్నాకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా చైతన్యయాత్రలో భాగంగా ఆదోని పట్టణంలో నెలకొన్న ప్రజా సమస్య పరిష్కారానికై ఈనెల 26వ తేదీన సీపీఎం ఆధ్వర్యంలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

తల్లిపై తనయుడి దాడి

ఆదోని అర్బన్: పట్టణంలోని కార్వన్‌పేటకు చెందిన ఉదయ్‌కుమార్ అనే వ్యక్తి తన తల్లి లక్ష్మిని కొట్టడంతో ఆమె ఆదివారం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసిందని త్రీటౌన్ సీఐ రామలింగమయ్య తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు కార్వన్‌పేటలోని ఉదయ్‌కుమార్ ఇంటికి వెళ్లి స్టేషన్‌కు పిలుచుకుని రావడానికి నరసింహులు అనే కానిస్టేబుల్‌ను పంపడం జరిగిందన్నారు. కానిస్టేబుల్‌ను కూడా ఉదయ్‌కుమార్ కొట్టాడని తెలిపారు. తల్లిని కొట్టడం, విధులకు ఆటంకం కలిగించి కానిస్టేబుల్‌పై చేయి చేసుకోవడంపై ఉదయ్ కుమార్‌పై రెండు కేసులను నమోదు చేశామని సీఐ తెలిపారు.

నేటి తరం నటులకు స్ఫూర్తి వెంకట నరసునాయుడు

కర్నూలు(సెంట్రల్): నేటి తరం నటులకు స్ఫూర్తి, దివంగత మహానటుడు వెల్దురి వెంకట నరసునాయుడు అని టీజీవీ కళా క్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అన్నారు. ఆదివారం వెంకట నర్సునాయుడు 38వ వర్ధంతి సందర్భంగా స్థానిక టీజీవీ కళా క్షేత్రంలో సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తి ఓబులయ్య మాట్లాడుతూ.. వెంకట నర్సునాయుడు తన నటనతో, మధురమైన గాత్రంతో అలనాటి ఆంధ్ర శ్రోతలను ఉర్రూతలూగించారని కొనియాడారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్.చంద్రన్న మాట్లాడారు. ఈ నేపథ్యంలోనే ధూపం తిరుమల తేజ, ధూపం రామక్రిష్ణ, బొబ్బిలి నాయుడును ఘనంగా సన్మానించి పారితోషికం అందించారు. నాయుడు మనుమడు వెంకటనాయుడు, పి.రాజారత్నం, జీవీ శ్రీనివాసరెడ్డి, ధూపం రామక్రిష్ణ, బాల వెంకటేశ్వర్లు, వీవీ రమణారెడ్డి, హనుమంతరావుచౌదరి తదితరులు పాల్గొన్నారు. అనంతరం రామాంజనేయ యుద్ధం నాటకాన్ని ప్రదర్శించారు. నాటకంలోని ప్రతి పద్యానికి ఆడిటోరియం కరతాల ధ్వనులతో మార్మోగింది.

మండల అభివృద్ధికి సహకరించాలి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీవిద్య

పెద్దకడబూరు : మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు మండల అభివృద్ధికి సహకరించాలని ఎంపీపీ శ్రీవిద్య కోరారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీఓ నాగరాజుస్వామి ఆధ్వర్యంలో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా మండల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదవి వినిపించారు. హెచ్.మురవణి ఎంపీటీసీ సభ్యురాలు – 2 ఈరేశమ్మ మాట్లాడుతూ తాగునీటి కోసం ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునేవారు కరువయ్యారని సభ దృష్టికి తీసుకొచ్చారు. కల్లుకుంట సర్పంచ్ ఇస్మాయిల్ మాట్లాడుతూ గ్రామంలో చేసిన పనులకు ఈఓపీఆర్డీ జయరాముడు బిల్లులు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు మండల అభివృద్ధికి సహకరించడంతో పాటు ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు రాజేశ్వరి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ ఆశయాలను సాధిద్దాం



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఆదోని రూరల్: స్వాతంత్ర్య సంగ్రామంలో దేశం కోసం ప్రాణాలు అర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల ఆశయాలను ప్రతిఒక్కరూ సాధించాలని డీవైఎఫ్ఐ మాజీ డివిజన్ కార్యదర్శి లక్ష్మన్న, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు వీరేష్, నాగరాజు, వెంకటేష్, వీరు అన్నారు. ఆదివారం పట్టణంలోని మండిగిరి, పర్వతాపురం, తిక్కస్వామి దర్గా ఏరియాల్లో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 94వ వర్ధంతి సభను నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు మోహన్, నాగరాజు, చాంద్, జామిర్ మహేష్, మంజు, సూరి తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో..

ఆదోని సెంట్రల్: పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని స్థానిక కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ, నాయకులు ఉమేష్, రవి, శరత్, వీరేష్, వంశీ, ప్రేమ్, విద్యార్థులు పాల్గొన్నారు.

- ఎస్ఎఫ్ఐ ఆదోని పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ పట్టణ ఉపాధ్యక్షులు వెంకట్ , నాయకులు శ్రీనివాస్, గణేష్, నాగరాజు, గౌడ్, సూర్య, రంజాన్ పాల్గొన్నారు.
- **ఎమ్మిగనూరుటౌన్:** పట్టణంలో ఆదివారం విద్యార్థి, యువజన, వామపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక సోమప్ప సర్కిల్‌లో పీవైఎల్ జిల్లా కార్యదర్శి చిన్ని ప్రసాద్ వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఐఎఫ్‌టీయూ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్‌తో పలు సంఘాల ఆధ్వర్యంలో వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.



ఎమ్మిగనూరు సోమప్ప సర్కిల్‌లో నివాళులర్పిస్తున్న దృశ్యం



చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆదోని డీవైఎఫ్ఐ నాయకులు

రాఘవేంద్ర స్వామి ఆలయంలో పూజలు



స్వామి వారి బృందావనానికి అభిషేకం చేస్తున్న మంత్రాలయం వేదపండితులు

కోసిగి: మండల పరిధిలోని అగసనూరు గ్రామంలో తుంగభద్ర నది ఒడ్డున నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీ రాఘవేంద్ర స్వామి బృందావనం ప్రతిష్టాపన చేసి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆదివారం ఉదయం మంత్రాలయం వేదపండితులు నేతృత్వంలో ఆలయ ప్రధాన అర్చకులు వెంకటేష్ స్వామి ఆధ్వర్యంలో బృందావనానికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, ఫల,పుష్పాలు సమర్పించి, మహా మంగళ హారతులు ఇచ్చి విశేష పూజలు గావించారు. ఆలయ ప్రాంగణంలో హోమ పూజలు చేపట్టారు. ప్రతిష్టాపన కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్ రెడ్డి, జిల్లా కార్యదర్శి పి. మురళీమోహన్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా స్వామి వారిని దర్శించుకుని పూజలు చేసుకున్నారు. ఆలయ కమిటీ, గ్రామ పెద్దల సమక్షంలో వారి శాలువా, పూల మాలలు వేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, గ్రామ సర్పంచ్ ఉలిగయ్య, మాజీ సర్పంచ్ ఆకాష్ రెడ్డి , రామన్న, నాగేష్, భీమన్న తదితరులు పాల్గొన్నారు.



పూజ కార్యక్రమానికి హాజరైన వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై ప్రదీప్ రెడ్డి

దేవరగట్టులో భక్తిశ్రద్ధలతో పూజలు



పూజలందుకుంటున్న మాళమల్లేశ్వరస్వామి

హొళగుంద: దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రధాన పూజారులు ఆలయంలోని మూల విరాట్‌లకు సుప్రభాతసేవ, బండారార్చన, కుంకుమార్చన, అభిషేకాలు, మహామంగళహారతి, అర్చనలతో పాటు రుద్రాభిషేకం తదితర ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మండలంతో పాటు ఆంధ్ర, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఘనంగా నెల పూజలు



నెరణికిలో ఊరేగుతున్న 11 గ్రామాల పట్టద దేవుళ్లు

హొళగుంద: మండలంలోని నెరణికి గ్రామంలో వెలిసిన నెణికిలింగేశ్వర స్వామి పట్టా దేవర (పట్టాభిషేక) ఉత్సవాల నెలపూజ కార్యక్రమాలను ఆదివారం గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. నెరణికిలో ఈ నెల 9న 11 గ్రామాల పట్టద దేవుళ్లతో దేవర వైభవంగా జరిగిన సంగతి తెలిసిందే. దేవర పూర్తయి నెల కావడంతో ఆదివారం నెల పూజను పురస్కరించుకుని నెణికిలింగేశ్వర స్వామితో పాటు భీరలింగేశ్వర స్వామి, కర్ణాటక నుంచి కార్యక్రమానికి హాజరైన హుల్లీలింగేశ్వర, కరమాంచప్పస్వామి ఉత్సవ విగ్రహాలను గ్రామ శివారులో గంగపూజ జరిపించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను పురవీధులో ఊరేగించారు.స్వామి వారి ఆలయంలో అభిషేకాలు, మహామంగళ హారతి, నైవేద్య సమర్పణ చేపట్టారు.

రేపు జాబ్‌మేళా

పత్తికొండ రూరల్ : పత్తికొండ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఈనెల 25వ తేదీన ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధిఅధికారి ఆనంద్ రాజ్‌కుమార్, పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మాధురి ఆదివారం తెలిపారు. 18–30 సంవత్సరాల్లోపు వయస్సు ఉండి పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ పాసైన నిరుద్యోగ యువతీ,యువకులు బయోడేటాతో జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు. వివరాలకు సెల్ : 9603303354 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఘనంగా సాయిప్రసాద్‌రెడ్డి జన్మదిన వేడుకలు



హైదరాబాద్‌లో నివాసంలో కేకు కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి,



రక్తదానం చేస్తున్న అభిమానులు

ఆదోని టౌన్: ఆదోని మాజీ ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి జన్మదిన వేడుకలు వైభవంగా జరిగాయి. ఆదోని పట్టణంలోని ఎస్కేడీ కాలనీ జీరో రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, మహిళా నాయకురాళ్లు, అభిమానులు, కౌన్సిలర్లు, సర్పంచుల భారీ కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. అనంతరం పార్టీ కార్యాలయంలో రక్తదానం ఏర్పాటు చేశారు. అదేవిధంగా హైదరాబాద్‌లో ఉన్న సాయిప్రసాద్‌రెడ్డి నివాసానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు ఆదోని నుంచి తరలివెళ్లారు. కేకు కట్ చేసి, పూలమాలలు వేసి అభిమానాన్ని చాటుకున్నారు. పట్టణంలో జరిగిన జన్మదిన వేడుకల్లో వైస్ చైర్మన్ నరసింహులు, జిల్లా నాయకులు నాగరాజు, పట్టణాధ్యక్షుడు దేవా, మండల యూత్ అధ్యక్షుడు నల్లారెడ్డి, పట్టణ కార్యదర్శులు తాయన్న, గిడ్డయ్య, సత్య, సన్ని, శ్రీదేవి, శోభాలత తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్‌కు మోక్షం



అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ సెంటర్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీడీఓ నాగరాజుస్వామి

పెద్దకడబూరు : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో 7 సంవత్సరాలకు పైగా అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ సెంటర్‌కు మోక్షం లభించింది. రూ. 5.20లక్షల మండల నిధులతో ఎంపీపీ శ్రీవిద్య, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సెంటర్ నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. అదేవిధంగా సర్పంచ్ నిధులు రూ. 5లక్షలు, ఎంపీపీ నిధులు రూ. 5లక్షలతో లక్ష్మీపేటలో ఓహెచ్ఆర్‌ని మరమతులకు కూడా పూజచేసి శ్రీకారం చుట్టారు. ఎంపీపీ శ్రీవిద్య, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ మండల అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామన్నారు. అంగన్‌వాడీ సెంటర్‌కు సొంత భవనం లేక అద్దె భవనాలు, దొరక్క ఇబ్బందులు పడుతున్నామని అంగన్‌వాడీ సిబ్బంది తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన మండల నిధులతో అసంపూర్తిగా ఉన్న సెంటర్‌ను నిర్మించి ఇవ్వాలని సూచించారన్నారు. దీంతో పాటు దాదాపు రూ. 10లక్షల నిధులతో ఓహెచ్చ్ఆర్‌కు మరమతులు చేపడుతున్నట్లు వివరించారు. ఇంకా మండలంలో ఎక్కడైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొనిరావాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రామాంజినేయులు, ఎంపీడీఓ నాగరాజుస్వామి, ఈఓఆర్డీ జయరాముడు, పంచాయతీరాజ్ ఏఈ ఖాదర్ బాషా, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అరుణకుమారి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ భూత్ కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, రైతువిభాగం అధ్యక్షుడు యల్లప్ప, నాయకులు పాల్గొన్నారు.

ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణానికి నిధులు కేటాయించాలి



సోమప్ప సర్కిల్‌లో రిలేదీక్షల్లో కూర్చున్న ప్రజా సంఘాల నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: ఆర్‌డీఎస్ కుడి కాలువ నిర్మించేందుకు ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని ఆర్‌డీఎస్ కుడి కాలువ సాధన సమితి అధ్యక్షుడు కేఆర్ రాఘవరెడ్డి, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి పలు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో రిలేదీక్షలు చేపట్టారు. వారు మాట్లాడుతూ జిల్లాలోని కోసిగి మండలంలోని అగసనూరు వద్ద తుంగభద్ర నదిపై ఆర్‌డీఎస్ కుడి కాలువ నిర్మించేందుకు 2013లో బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ నాలుగు టీఎంసీల నికర జలాల హక్కులు కేటాయించిందన్నారు. అయితే కుడి కాలువ నిర్మాణానికి ప్రభుత్వాలు నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఏటా 150 టీఎంసీల తుంగభద్ర జలాలు శ్రీశైలంలో కలుస్తున్నాయని చెప్పారు. కుడి కాలువకు నిధులు కేటాయించక ప్రభుత్వాలు జిల్లాలోని పశ్చిమ ప్రాంతాన్ని శాశ్వత కరువు ప్రాంతాలుగా మార్చారని ఆరోపించారు. ఏపీ విభజన హామీ చట్టాలను అమలు చేయడం లేదని, శ్రీబాగ్ ఒప్పందం అమలు చేయకుండా ప్రాంతాల అసమానతలకు ప్రభుత్వాలే కారణమన్నారు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి వుంటే ఆర్‌డీఎస్ కుడి కాలువ నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్లు పంపన్న గౌడ్, స్వామిదాసు, సాంసోన్, బతకన్న, నీలకంఠ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



కాలువకు నీరు వదులుతున్న ఎల్ఎల్‌సీ సిబ్బంది



వరి పంట పొలాలను పరిశీలిస్తున్న ఏఈ ఈశ్వర్

సాక్షి ఎఫెక్ట్

స్పందించారు.. పొలాలకు నీరందించారు

కౌతాళం: కౌతాళం మేజర్ కాలువకు నీరందకపోవడంతో వరి పైర్లు ఎండుతుండటంపై 'పొట్ట దశలో వరి.. పంట నీరందక రైతన్నలు వర్రీ' అన్న శీర్షికన ఆదివారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎల్ఎల్‌సీ అధికారులు కౌతాళం మేజర్ కాలువ మీద పర్యటించి రాజనగర్ క్యాంపు వద్ద ఎండిపోతున్న వరి పంట పొలాల రైతులతో మాట్లాడి, వారి పొలాలకు నీరందించారు. ఏఈ ఈశ్వర్, సిబ్బంది పొలాలను పరిశీలించి దగ్గర ఉండి 50ఎకరాల వరకు ఎండి పోయిన వరిపైర్లకు నీటిని వదిలారు. చివరి దశలో పంట ఉందని ఇప్పుడు నీరు ఎంతో అవసరమని, ఇప్పుడు నీరు అందక పోతే తమ పంటలు చేతికి రావని రైతులు అధికారులకు వివరించారు. కింద స్థాయి సిబ్బంది వల్ల తమ పొలాలకు నీరు రాకుండ పోతున్నాయని ఏఈకి ఫిర్యాదు చేశారు. సిబ్బంది పై చర్యలు తీసుకుంటామని, ఎక్కడ ఎలాంటి సమస్య ఉన్న తనకు ఫోన్ చేస్తే స్పందిస్తానని ఏఈ ఈశ్వర్ రైతులకు భరోసా కల్పించారు. ఎక్కడా పొలాలు ఎండకుండా చేస్తామని హామీ ఇచ్చారు.